క్లుప్తంగా

ఇష్టంగా చదివితే ఉత్తమ ఫలితాలు



బహుమతులు అందజేస్తున్న ప్రసాద్

ఇల్లెందురూరల్: చదువుపై మక్కువ పెంచుకొని పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని విశ్వశాంతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ తుమ్మలపల్లి ప్రసాద్ అన్నారు. మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ కేంద్రంలోని పాఠశాల ఆవరణలో శనివారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులకు పలు అంశాలపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చేలా చదువులో రాణించాలన్నారు.

మేరు సంఘం కమిటీ ఎన్నిక



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న అధ్యక్ష, కార్యదర్శులు

ఇల్లెందు: పట్టణంలో మేరు సంఘం కమ్యూనిటీ హాల్‌లో శనివారం కమిటీ సభ్యులు సమావేశమై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ మేరు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సింగు రమేష్, ప్రధాన కార్యదర్శిగా దీకొండ నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కీర్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా దీకొండ పెద్ద నాగరాజు, కోశాధికారిగా రాజారావు, కీర్తి ప్రసాద్, వెంకటేశ్వర్లు, గట్ల ప్రవీణ్, వెంకటేష్, మాడిశెట్టి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. అనంతరం వారికి ఎన్నిక ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

4న చలో విజయవాడ

కొత్తగూడెంరూరల్: ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జనవరి 4న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంతో జరిగే మాదిగల న్యాయ మహాసభను జయప్రదం చేయాలని జాతీయ నాయకుడు ముద్దా పిచ్చయ్య అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ భవనంలోని చలో విజయవాడ మాదిగల సామాజిక న్యాయ మహాసభ వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగల జనాభాకు అనుగుణంగా పార్టీలు రాజకీయ అవకాశాలు కల్పించకపోవడం దారుణమన్నారు. మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆంధ్రప్రదేశ్‌లో సామాజికంగా మాదిగలకు న్యాయమైన సమాన రాజకీయ అవకాశాలు కల్పించాలన్నారు. కూసపాటి శ్రీనివాస్, గుండా రమేష్, అవులూరి సత్యనారాయణ, మారపాక రమేష్, బంకురి పరమేష్, పులిగుజ్జ, వసంతకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



కమిటీతో సభ్యులతో నాయకులు

టేకులపల్లి: మాదిగ రిజర్వేషన్ పోరాట కమిటీ టేకులపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఎస్సీ వర్గీకరణపై చర్చించారు. అనంతరం మండల కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా జినక సురేష్, ఉపాధ్యక్షుడిగా పోలెపొంగు వెంకటేశ్వర్లు, పోలెపొంగు లక్ష్మణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'స్టాఫ్‌నర్స్‌ల నియామకాల్లో అక్రమాలు'

కొత్తగూడెంటౌన్: స్టాఫ్‌నర్స్‌ల ఎంపికల ప్రక్రియ అంతా అక్రమమని, నియామకాలు రద్దు చేయాలని కోరుతూ ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్‌నాయక్ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సోనీ బాలాదేవి ఐఏఎస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్‌నాయక్ పలు విషయాలను ఆయనకు వివరించారు. ప్రొవిజనల్ ప్రకారం 1:4 నిష్పత్తిన సర్టిఫికేట్ వెరిఫికేషన్, ఎంపిక జాబితా సక్రమంగా జరగలేదని వివరించారు. గత ప్రభుత్వంలో హెల్త్ డైరెక్టర్‌గా పని చేసిన గడల శ్రీనివాసరావు కనుసన్నల్లోనే ఈ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. తమ వారిని నియమించుకునే విధంగా జాబితా సిద్ధం చేసుకున్నారని ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

న్యూ ఇయర్‌కు స్వాగతం..

జూలూరుపాడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జూలూరుపాడు పెండ్యాల భాగ్యమ్మ మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సాయి ఎక్సలెంట్ స్కూల్‌లో కేక్ కట్ చేసి కొత్త సంవత్సర వేడుకలు ముందుస్తుగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గీత, ఉపాధ్యాయులు డి.భాస్కర్, సీతారాములు, విజయలక్ష్మి, స్వర్ణ, పద్మావతి, సాయి ఎక్సలెంట్ స్కూల్ కరస్పాండెంట్ ఆరెబోయిన కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ శారదాదేవి, హాస్సేన్ దంపతులు, అనిత, మణిదీప్, మోహన్, అరుణ, అశోక్, జమున, భార్గవి, సాహితీ, సరిత, నబీనా, దుర్గా భవానీ పాల్గొన్నారు.

టేకులపల్లి: 2023కి బైబై చెబుతూ 2024కి స్వాగతం పలుకుతూ నూతన సంవత్సరం వేడుకలు విద్యాలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలకు ఆది, సోమవారాలు సెలవు కావడంతో శనివారమే



జూలూరుపాడు ప్రాథమిక పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

సుజాతనగర్: నూతన సంవత్సరం సందర్భంగా మండల కేంద్రంలో శనివారం ఆయా దుకాణాల ఎదుట కేకు, రంగులను విక్రయించేందుకు సిద్ధం చేశారు. దుకాణదారులు పోటాపోటీగా కేక్‌లను అమ్మకానికి ఉంచారు. కేజీ కేక్ రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. ఇళ్ల ముందు ముగ్గులు వేసేందుకు మహిళలు రంగులు కొనుగోలు చేస్తున్నారు.



సుజాతనగర్: రంగుల అమ్మకం...



టేకులపల్లి: పాతతండాలోని ప్రాథమిక పాఠశాలలో



జూలూరుపాడు: ఎక్సలెంట్ స్కూల్‌లో...

విద్యార్థినికి ఆర్థిక ప్రోత్సాహం



మనీషాను సన్మానిస్తున్న లక్ష్మీనారాయణ

చుంచుపల్లి: ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని పొట్టబత్తిని మనీషాకు తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. శనివారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన పద్మశాలి కుటుంబ సభ్యుల వనసమహారాధన కార్యక్రమంలో పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతుల లక్ష్మీనారాయణ, కార్యదర్శి దూలం నటరాజ్ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించి, ప్రస్తుతం హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో బీటెక్ చదువుతున్న మనీషాకు రూ.10,116 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. పద్మశాలి ఉద్యోగుల సంఘం ద్వారా ప్రతిభ కనబరిచిన పద్మశాలి విద్యార్థులకు ఆర్థిక సాయంతో పాటు వివిధ రకాలుగా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాసర్ల శ్రీనివాస్, కొండి పద్మజ, బేతి రమేష్ బాబు, పసునూటి శ్రీనివాస్, కాటాబత్తిని ఉమేశ్వరి, పసునూటి వెంకటేశ్వర్లు, బింగి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

ఇల్లెందు: లోక్ అదాలత్‌లో పరిష్కారం అయిన కేసులు అవార్డుతో సమానం అని రాజీమార్గం ద్వారా ఎంతటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి అన్నారు. ఇల్లెందులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కరించారు. రెండు కోర్టులలో 739 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు దంతాల ఆనంద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడి సత్యప్రకాష్, న్యాయవాదులు సూర్ణపాక సత్యనారాయణ, రవికుమార్ నాయక్, కీర్తి కార్తీక్, ఉమామహేశ్వరరావు, ఏపీపీలు రచిత, శ్రీనివాస్, సీనియన్ న్యాయవాదులు మల్లిఖార్జునరావు, గోపీనాథ్, ఖాసీం, జయ ప్రకాష్ పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



ఇల్లెందు: శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



జూలూరుపాడు శ్రీ సీతారామాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఇల్లెందు: జనవరి 22న అయోధ్యలో దివ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఇల్లెందు పట్టణంలో రామ భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. శనివారం పట్టణంలోని జగదాంబా సెంటర్ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతర రామలయం నుంచి ఆయోధ్య అక్షింతలు, రాములోరి చిత్రపటంతో ప్రదర్శన నిర్వహించారు. రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతీ గడపకు అక్షింతలు అందజేస్తామని నిర్వాహకులు సతీష్ ఖండేల్‌వాల్ తెలిపారు. పటేల్ చౌక్‌లోని రామ్‌దేవ్ బాబా మందిరం వరకు చేరుకుని అక్కడ భక్తులకు అక్షింతలు, చిత్రపటం అందజేశారు. గాయత్రీ పరివార్ యుగ్ నిర్మాణ్ సంస్థ, శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్రం, ఇల్లెందుశాఖ, భజరంగ్‌దళ్, విశ్వ హిందుపరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ సంఘం కార్యకర్తలు రాజేశ్వరరావు, రాములోనియా, సంతోష్‌శర్మ, జయప్రకాష్, గురుకృప బాలకృష్ణ, రచన ఖండేల్‌వాల్, మీనా కుమారీ లాహోటీ, రేణుక తివారీ, బసంతి సుజాతరెడ్డి పాల్గొన్నారు.


జూలూరుపాడు: అయోధ్య రామ మందిరం నుంచి జూలూరుపాడు మండలంలోని ఆలయాలకు చేరుకున్న శ్రీరాముని అక్షింతలను శనివారం భక్తులకు పంపిణీ చేశారు. గ్రామాల్లోని ఆలయాల్లో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, రామ, ధర్మజాగర, గోటి తలంబ్రాల భక్తులు రాముని అంక్షితలతో శోభాయాత్ర నిర్వహించారు. సీతారామాలయంలో 54 గ్రామాలకు ఆలయ కమిటీ సభ్యులు, రామ, ధర్మజాగరణ భక్తులకు రాముని అంక్షితలు పంపిణీ చేశారు. రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ జరగనున్న జనవరి 22న భక్తులు ఇంట్లో ఐదు దీపాలు వెలిగించి, రాముని అక్షింతలను శిరస్సుపై వేసుకొని పూజలు చేసుకోవాలని పూజారులు పేర్కొన్నారు.

సీఆర్టీల వేతన వెతలు

- నాలుగు నెలలుగా వేతనాలు లేక ఇక్కట్లు
- జిల్లాలో 211 మంది సీఆర్టీలు

టేకులపల్లి: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 20 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో బోధిస్తున్న సీఆర్‌టీ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు నాలుగు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తూ విద్యా ప్రమాణాల పెంపుకు కృషి చేస్తున్న సీఆర్‌టీలకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. సంక్రాంతి సమీపిస్తుండగా పండుగ రోజులు కూడా పస్తులేనా అని ఆవేదన చెందుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 211 మంది సీఆర్టీలు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నాలుగు నెలల వేతనంతో పాటు పీఆర్‌సీ ఏరియర్స్, పదో తరగతి బోధనకు సంబంధించిన వేతనం బకాయి ఉండటంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఆరోగ్యం తదితర అవసరాలకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన చెందుతున్నారు. విధులకు హాజరయ్యేందుకు రవాణా ఖర్చులకు కూడా ఇబ్బంది పడుతున్నట్లు దిగులుపడుతున్నారు. ఉద్యోగ భద్రత, బేసిక్ పే చెల్లించాలని సీఆర్‌టీలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని బాధితులు విన్నవిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో అప్పులతో ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి జీతాలు విడుదల చేయాలి. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా 20 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. సకాలంలో వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. నూతన ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి, పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

– జి.రవికుమార్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు

అతిగా ప్రవర్తిస్తే.. కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

ఇల్లెందు: నూతన సంవత్సర వేడుకల పేరుతో అతిగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లెందు సీఐ టి.కరుణాకర్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నూతన సంవత్సరం సందర్భంగా యువకులు మద్యం సేవించి రోడ్ల మీద కేక్‌లు కట్ చేసుకునేందుకు అనుమతి లేదన్నారు. ఎవరి ఇంట్లో వాళ్లు ఉత్సవాలు చేసుకోవాలని, రాత్రి 1 గంట తర్వాత రోడ్ల మీద ఎవరూ కనిపించరాదని పేర్కొన్నారు. బైక్‌లు, కార్లు వేగంగా నడిపినా, ఇద్దరు ముగ్గురు బైక్‌లపై సవారీ చేసినా, రోడ్ల మీద న్యూసెన్స్ చేసిని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామసభలకు విరామం

సుజాతనగర్: ప్రభుత్వ సెలవుల కారణంగా ఆది, సోమవారం రెండు రోజుల పాటు గ్రామసభలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించినట్లు తహసీల్దార్ జి.శిరీష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం, జనవరి 1 నూతన సంవత్సరం సందర్భంగా సెలవులు ఉన్నాయని పేర్కొన్నారు. తిరిగి 2వ తేదీన సర్వారం, గరీబ్‌పేట, సుజాతనగర్‌లలో గ్రామసభలు కొనసాగుతాయని తెలిపారు.


పిల్లల హాజరు శాతాన్ని పెంచాలి



మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మల జ్యోతి

జూలూరుపాడు: పిల్లల హాజరు శాతాన్ని పెంచాలని ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ నిర్మల జ్యోతి అన్నారు. శనివారం జూలూరుపాడు, కొమ్ముగూడెం, పాపకొల్లు సెక్టార్ల సమావేశం జరిగింది. ఈ సమావేశం సీడీపీఓ మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాలను సమయానికి తెరవాలని, రికార్డులు అప్‌డేట్ చేయాలని చెప్పారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. బాల్య వివాహాలు, మహిళల హక్కులు, పోక్సో చట్టం, చైల్డ్‌లైన్ హెల్ప్ లైన్–1098, ఉమెన్ హెల్ప్ లైన్–181 గురించి ఆమె అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీఓ వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, నాగమణి, డి.శంకుతల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రగ్గులు పంపిణీ



గిరిజనులకు రగ్గులు అందజేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: మందేరకలపాడు గ్రామంలోని గుత్తికోయ 40 గిరిజన కుటుంబాలకు శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్ ఆధ్వర్యంలో రగ్గులు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చేపూరి బ్రహ్మచారి, పరిటాల చంద్రశేఖర్‌రావు, జిల్లా కోఆర్డినేటర్ ఆరుద్ర సత్యనారాయణ, జోన్ చైర్మన్ చాట్ల శ్రీనివాసరావు, మాడిశెట్టి రాజా, మనోహర్, సతీష్, అక్రమ్ అలీ, సర్పంచ్ కల్తీ రమేష్ నాయకులు సోయం సత్యనారాయణలు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి 'సంక్షేమం' అందుతుంది..



రాంపురంలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



గోలియాతండాలో దరఖాస్తులు అందజేస్తున్న స్థానికులు

టేకులపల్లి: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజాపాలన గ్రామసభల విషయంలో ఎలాంటి ఆటంకం లేకుండా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అధికారులకు సూచించారు. ఈ మేరకు శనివారం మండలంలోని గోలియాతండా, రాంపురం, చింతోనిచెలక, చంద్రుతండా, పెట్రాంచెలక పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామసభలు జరిగాయి. ఎమ్మెల్యే పాల్గొనిమాట్లాడారు. రేషన్‌కార్డు లేకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆరు గ్యారంటీ పథకాలు కచ్చితంగా అమలు జరుగుతాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలే కాకుండా ఇతర ఏ సమస్యలు ఉన్నా వేరే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, నింపడం, ప్రజలకు సమాచారం ఇవ్వడం, గ్రామసభల వద్ద సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఇల్లెందు నియోజకవర్గ ప్రత్యేక అధికారి కాశయ్య, డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్, ఎంపీడీఓ కోట వీరబాబు, తహసీల్దార్ కృష్ణవేణి, ఏఈ రాంబాబు, సర్పంచ్‌లు బోడ నిరోషా, భూక్యా ఇందిర, కార్యదర్శులు కిరణ్, సందీప్, ఎంపీటీసీ సరోజిని, సీతమ్మ, అనురాధ, నిర్మల, ఏపీఎం రవికుమార్, నవీన్, దేవా, ఎస్‌ఐ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం మాట నిలబెట్టుకోవాలి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో తాజా గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, ఎర్రజెండా విలువ కాపాడాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ కొత్తగూడెం బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ముందుగా గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీకి శుభాకాంక్షలు తెలిపారు. మాట్లాడుతూ.. 1998లో గుర్తింపు సంఘం ఎన్నికలు ప్రారంభమైన నాటి నుంచి ఏఐటీయూసీ నాలుగు సార్లు విజయం సాధించినట్లు చెప్పారు. మధ్యలో దశాబ్దకాలం వేరే యూనియన్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ, ఆ యూనియన్ తప్పిదాలను కార్మికులు గుర్తు చేస్తే పట్టం కట్టారన్నారు. కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కోరారు. కొన్ని కార్మిక సంఘాలు కార్మికులను అనేక ప్రలోభాలకు గురిచేశాయని, పెళ్లి తరహాలో మండపాలు ఏర్పాటు చేసి మందు, మద్యం పంపిణీ చేసినట్లు ఆరోపించారు.

దరఖాస్తులు ఉచితంగా అందజేయండి



నాగారంకాలనీలో గ్రామసభను పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రావు

పాల్వంచరూరల్: ఆరు గ్యారంటీలను ప్రజలకు అందించే విధంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలో ప్రజలందరికీ ఉచితంగా దరఖాస్తులు అందజేయాలని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మండల పరిధి నాగారం కాలనీ పంచాయతీలో శనివారం జరిగిన ప్రజాపాలన గ్రామసభను జిల్లా పరిషత్ చైర్మన్ సందర్శించి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. మాట్లాడుతూ... దరఖాస్తులు పూరించలేని సిబ్బంది సహకరించాలని సూచించారు. మండలంలో మొత్తం 1600 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ పారండ్ల రంగా, సర్పంచ్ విజయలక్ష్మి, కార్యదర్శి సతీష్ ఆర్‌డబ్లూఎస్ ఏఈ నీలావతి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం అందించాలి



మాట్లాడుతున్న ఏపూరి వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులాలన్నింటికీ సామాజిక న్యాయం అందించాలని ఎమ్మార్పీఎస్–ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. శనివారం జూలూరుపాడు ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్–ఎంఎస్పీ జిల్లా అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరవీరుల పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో మాదిగల భాగస్వామ్యమే అగ్రభాగమన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కేసీఆర్ మాదిగల ఉనికిని దెబ్బతీశారని ఆరోపించారు. నూతనంగా సీఎం బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్నిరంగాల్లో సముచిత స్థానం కల్పించినట్లు చెప్పారు. కానీ సీఎం మూడు వారాల పాలనలో మంత్రివర్గంలో మాజీ సీఎం కేసీఆర్ ఫార్ములా అనుసరిస్తున్నట్లు కనిపిస్తోందని, దీనిని సరి చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పాలనలో మాదిగలకు సామాజిక న్యాయం చేయాలని, విద్య, ఉద్యోగ, సంక్షేమ, ఇతర రంగాల్లో జనాభా ప్రకారం అవకాశం కల్పించాలన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జూలూరుపాడు మండల అధ్యక్షుడిగా దెబ్బోందుల సాయికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సముద్రాల పవన్‌కుమార్, అధికార ప్రతినిధిగా ఇసనపల్లి కల్యాణ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వంగూరి ఆనందరావు, దేసంగి రమణయ్య, కొత్తపల్లి సోమయ్య, ఇసంపల్లి కృష్ణ, అలవాల రాజాపెరుమార్, మేకల లలిత, మిర్యాల వెంకటేశ్వర్లు, నల్లగట్ల తిరుపతి, నంగూరి రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


'సఖి' ఆధ్వర్యంలో పేదలకు వితరణ




నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సఖి సభ్యులు

కొత్తగూడెంరూరల్: సఖి జాతీయ మహిళా మండలి ఆధ్వర్యంలో కొత్తగూడెం బూడిదగడ్డకు చెందిన పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ సరాల సత్యనారయణ మాట్లాడుతూ.. పేద ప్రజలకు సేవ చేయడానికి సఖి జాతీయ మహిళా మండలి ఏర్పడిందన్నారు. ఇప్పటి వరకు 76 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, బియ్యం, ఆర్థిక సాయం పంపిణీ చేసినట్లు తెలిపారు. ముందుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ఇప్పటి వరకు 29 రాష్ట్రాలలో సఖి జాతీయ మహిళా మండలిని ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. మహిళా సమస్యలు పరిష్కరించడంలో ముందుంటామని చెప్పారు. మహిళా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక లీగల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా పద్మావతి, నేషనల్ కోకన్వీనర్ కొలిపాక నాగమణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంగాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందిరపు యశోద, కళ్యాణి, సోన్, సవంత్రి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌పై మంచుదుప్పటి..



ఉదయం 7 గంటలకు



9 గంటలకు...

ప్రకృతి చిత్రమైంది. ఎంత చూసినా తనివి తీరదు.. ఒక్కోసారి మన కళ్లను మనమే నమ్మలేం.. మైమరచి పోతుంటాం.. పైఫొటో చూడండి... శనివారం అంత పొద్దెక్కినా సూర్యభగవానుడి జాడ లేదు. తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు సుజాతనగర్ మండల వ్యాప్తంగా పొగమంచు కమ్మేసింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రహదారిపై హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణాలు కొనసాగించారు. వ్యవసాయం, వివిధ పనులకు వెళ్లేవారు మంచులోనే వెళ్లాల్సి వచ్చింది. మార్నింగ్ వాకర్స్ హిమబిందువులను ఆస్వాదించారు. ఈ చిత్రాన్ని 'సాక్షి 'కెమెరాలో బంధించింది.

– సుజాతనగర్